

కళా విన్యాసం

ఎస్వీయూలో యువ తరంగ్-2024 జోరుగా హుషారుగా సాగుతోంది. రెండో రోజైన శనివారం కళాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. సమాంతర వేదికల్లో నిర్వహించిన కళా విన్యాసాలను న్యాయ నిర్ణేతలు తిలకించారు. నేటితో కార్యక్రమం ముగియనుంది.

అలంకార ప్రియుడికి పుష్పార్చన

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.పుష్పయాగానికి అవసరమైన పూలకు తిరుమలలోని గార్డెన్‌లో ప్రత్యేక పూజలు చేసి శ్రీవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాభరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల పాటు 17 రకాల పుష్పాలు, ఆరు రకాల పత్రాలతో నివేదిన అర్పించారు. అంతకు ముందు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించాక నక్షత్ర హారతి, కుంభ హారతి, ప్రత్యేక హారతి సమర్పించారు.టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఉద్యానవనం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సేవలకు అందలం

● ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురు టీడీపీ నాయకులకు కీలక పదవులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండో విడత నామినేటెడ్ పోస్టుల జాబితాను శనివారం ప్రకటించింది. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురికి కీలక పదవులు లభించాయి. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) ఛైర్‌పర్సన్‌గా మాజీ మేయర్ కటారి హేమలతను నియమించారు.చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్‌కు వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం ఇచ్చారు.యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్‌ను ఎంపిక చేశారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం నియమితులయ్యారు. ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాళెం విజయకుమార్‌ను నియమించారు.

- చిత్తూరు/తిరుపతి, ఆంధ్రజ్యోతి



టీడీపీతో సుదీర్ఘ అనుబంధం

యాదవ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన నరసింహ యాదవ్ కుటుంబం సుదీర్ఘంగా టీడీపీలో ఉంది.2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు తుడా ఛైర్మన్‌గా నరసింహ యాదవ్‌కు అవకాశం ఇచ్చింది. ఆ తర్వాత 2019లో టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడిగా నియమించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీటీడీ, తుడాపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. మూడు పార్టీల మధ్య సర్దుబాటు క్లిష్టంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం మాత్రం నరసింహ యాదవ్‌కు న్యాయం చేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తుడాపై కొనసాగుతున్న ఉత్కంఠ

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఛైర్మన్ నియామకంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. రెండోదశ నామినేటెడ్ పదవుల జాబితాలో తుడా లేకపోవడం చర్చనీయాంశమైంది.తాజా జాబితాలో తమ పేరుంటుందని భావించిన ఆశావహులకు నిరాశే ఎదురైంది. తుడా ఛైర్మన్ రేసులో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్‌లతో పాటు డాలర్స్ దివాకర రెడ్డి, శ్రీధర్ వర్మ, కాంట్రాక్టర్ శంకర్ రెడ్డి పేర్లు వినిపించాయి. యాదవ కార్పొరేషన్ పదవికి నరసింహ యాదవ్ భర్తీ కావడంతో మిగిలినవారి పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో తుడా ఉత్కంఠకు తెరదించే పనిలో కూటమి ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.



ఇచ్చిన మాట ప్రకారం

తిరుచానూరుకు చెందిన సీఆర్ రాజన్ గతంలో సర్పంచిగా పనిచేశారు. వన్నియకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ఆయన చిత్తూరు అసెంబ్లీ టికెట్ కోసం పోటీపడ్డారు.చిత్తూరులో కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు.అందరితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. గురజాల జగన్మోహన్‌కు టికెట్ దక్కడంతో ఆయన నిరాశ చెందారు. దీంతో ఆయనకు పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. ఆయన కూడా గురజాలతో కలిసి పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజున చిత్తూరు మురకంబట్టుకు వచ్చిన చంద్రబాబు 'కొన్ని కారణాలతో సీఆర్ రాజన్‌కు టికెట్ ఇవ్వలేకపోయాం. పార్టీ వచ్చాక సముచిత స్థానం కల్పిస్తాం'అని ప్రకటించారు. దీంతో రాజన్‌కు సముచిత స్థానం లభించింది. వన్నియకుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నియమించారు.

సముచిత స్థానం



చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత.. తొలి విడత నామినేటెడ్ పోస్టుల జాబితాలో టూరిజం డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. అయితే అది ఆమెకు తగిన పదవి కాదని పార్టీ వర్గాలతో పాటు ఆమె అభిమానుల్లో అసంతృప్తి వ్యక్తమైంది.ఆమె మాత్రం పార్టీ మీద గౌరవం, నమ్మకంతో తన అసంతృప్తిని ఎక్కడా బయటపెట్టలేదు.చంద్రబాబును కలిసి మరోసారి పరిశీలించాలని కోరడంతో రెండో జాబితాలో ఆమెకు చుడా ఛైర్‌పర్సన్‌గా అవకాశం లభించింది.2016లో తన అత్త కటారి అనురాధ, ఆమె భర్త మోహన్ హత్యకు గురైన తర్వాత మేయర్ అయిన హేమలత పాలనలో తనదైన ముద్ర వేశారు. 2019లో పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. వైసీపీ అక్రమాల్ని ప్రశ్నించడంతో అక్రమ కేసుల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కరోనా సమయంలో భర్త ప్రవీణ్‌ను కోల్పోయాక ఒంటరిగా పార్టీకోసం పోరాడుతూ వచ్చారు. ఆరుగురు ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల్లో ఆమె కూడా ఉండి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురజాల జగన్మోహన్‌కు టికెట్ వచ్చినా.. ఆయన గెలుపు కోసం శ్రమించారు.

జయహో బీసీతో గుర్తింపు



ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన రుద్రకోటి సదాశివం పార్టీలో అనేక బాధ్యతలను నిర్వహించారు. టీడీపీ జిల్లా బీసీ సెల్ ప్రచార కార్యదర్శిగా, టీఎన్‌టీయూసీ నాయకుడిగా, నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2022 నుంచి తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వీటితో పాటు వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం తిరుపతి అధ్యక్షుడిగా, వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా డిప్యూటీ గవర్నర్‌గా ఉన్నారు. జిల్లావ్యాప్తంగా జయహో బీసీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి అధిష్ఠానం వద్ద గుర్తింపు తెచ్చుకున్నారు.

టీడీపీ స్వరం



మీడియా వేదికగా టీడీపీ స్వరం ధాటీగా వినిపించే నీలాయపాళెం విజయకుమార్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ పదవి లభించింది. ఈయన ఎస్వీ యూనివర్సిటీలో ఎకనామెట్రిక్స్‌లో ఎంఫిల్ చేశారు. కార్పొరేట్ కంపెనీల్లో కీలక బాధ్యతల్లో ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారు. పదిహేనేళ్లుగా టీడీపీలో కీలక బాధ్యతల్లో ఉన్నారు.ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు.

8 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

● తిరుపతి జిల్లా నుంచే ఎక్కువమంది ఎంపిక



సురేష్ - మంజువాణి - సుబ్రహ్మణ్యం - కామాక్షయ్య



యామిని - ప్రభాకర్‌రావు - ఆనంద్ - బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నుంచి ఎనిమిది మంది ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యాబోధన, నిర్వహణకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులతో గౌరవిస్తోంది. ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులు అవార్డులు గెలుచుకున్నారు.

వారి వివరాలు ఇలా..

ఏర్పేడు మండలం, పల్లం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా అవార్డు అందుకోనున్నారు తొట్టంబేడు మండలం, దిగువ సాంబయ్యపాలెం మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ కె.బాల సుబ్రహ్మణ్యం, చంద్రగిరి మండలం రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, ఏర్పేడు మండలం బందార్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయులు ఎం.సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం,రాజానగరం జిల్లా పరిషత్ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయులు వి.కామాక్షయ్య,తిరుపతి జిల్లా దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) పీజీటీ బి.యామిని, కేవీబీపురం కేజీబీవీ క్రాఫ్ట్ టీచర్ ఆర్.మంజువాణి, శ్రీకాళహస్తి మండలం జడ్పీ హైస్కూల్ సోషల్ స్టడీస్ టీచర్ సురేష్ కునాటి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సురేష్ ఇటీవల జాతీయ స్థాయి అవార్డు అందుకున్నారు. వీరు ఆదివారం విజయవాడ లబ్బీపేటలోని ఎ-కన్వెన్షన్ హాల్లో జరుగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డులను అందుకోనున్నారు.

రూ.కోట్లు కూడేసి ఏసీబీకి దొరికేశాడు

● మాజీ ఆర్డీవో మురళి ఆస్తులపై విస్తృత సోదాలు ● కీలక డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి):ఆదినుంచీ వివాదాస్పద అధికారిగా పేరుబడ్డ డిప్యూటీ కలెక్టర్ మద్దాల సాకపు మురళి అనతి కాలంలోనే కోట్లు వెనకేసుకున్నాడని ఏసీబీ గుర్తించింది.2022లో మదనపల్లెకు ఆర్డీవోగా వచ్చిన మురళికి 2024 జనవరి 17న తహసీల్దారుగా ప్రభుత్వం రివర్షన్ ఇచ్చింది. గతంలో ప్రకాశం జిల్లాలో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో సంతనూతలపాడు మండలం పేర్నమిట్టలో సర్వే నంబరు 344లో ఒంగోలు ఛారిటబుల్ సదావర్తి మఠానికి చెందిన ఇనాం భూములను అక్రమంగా ఇతరులకు కట్టబెట్టారన్న ఆరోపణలకు గురయ్యారు. సంబంధిత సర్వే నంబరులో 66.25 ఎకరాలను ఇతరులకు పట్టాలు కేటాయించి, పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై మఠం ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి జేసీ-2 విచారణ జరిపి ఆరోపణలు వాస్తవమని తేల్చి ప్రభుత్వానికి నివేదించారు. దానిపై ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 17న ఆయనకు తహసీల్దారుగా రివర్షన్ ఇచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో కొంతకాలానికే ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల ఆలయ ఈవోగా పోస్టింగు సంపాదించారు. నెల తరువాత తిరుపతి కలెక్టరేట్‌లో లీగల్‌సెల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. తరువాత మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ ఫైళ్ళ దగ్ధం కేసులో ప్రభుత్వం మురళీని సస్పెండ్ చేసింది.ఈ నేపథ్యంలో పలు చోట్ల ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడని ఏసీబీ డీజీపీకి అందిన ఫిర్యాదుతో కడప, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని దాదాపు 65 ప్రాంతాల్లో ఏసీబీ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏఎస్పీ విమలకుమారి పర్యవేక్షణలో దాదాపు 13 బృందాలు శనివారం ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. మురళీని ఏసీబీ అధికారులు తిరుపతిలోని అతని ఇంటి వద్ద శనివారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నాక సోదాలు ప్రారంభించారు. శనివారం రాత్రి వరకు అందిన సమాచారం మేరకు తిరుపతి ఓటేరులోని ఎల్ఎన్‌కే రెసిడెన్సీలోని మురళీ ఇల్లు, ఎంకే నాయుడు కాలనీలోని ఎవర్ గ్రీన్ అపార్టుమెంటులో ఫ్లాట్ నెంబరు 202లో ఆయన కుమారుడు లీలా సాయికృష్ణ, బైరాగిపట్టెడలోని స్నేహితుడు డిప్యూటీ తహసిల్దార్ శేషగిరి, విద్యానగర్ కాలనీలోని సర్వేయర్ చిట్టిబాబు ఇళ్ళలో సోదాలు జరిగాయి. తిరుపతి సమీపంలోని తనపల్లి క్రాస్ వద్ద కుమారుడి పేరుతో వున్న సాయి గ్రాండ్ హోటల్‌లో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందానికి పలు కీలక రికార్డులు దొరికినట్లు సమాచారం. వీటితో పాటు భారీ ఎత్తున ఆస్తులు కొనుగోలు చేసి బినామీ పేర్లతో వుంచిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిలో ఇప్పటి వరకు జరిగిన సోదాల్లో 50 సవర్ల బంగారు నగలు, వెండి వస్తువులు, లక్షలాది రూపాయల డబ్బు సీజ్ చేసినట్లు సమాచారం. బైరాగిపట్టెడలోని డిప్యూటీ తహసిల్దార్ ఇంటిలో కొన్ని కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ చిట్టిబాబు ఇంటిలో మురళి పేరుతో బ్యాంకు లావాదేవీల పత్రాలు వున్నట్లు తెలిసింది.తిరుపతి పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ప్లాట్లు వేసి విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది. మురళి వి.కోటవాసి కావడంతో అక్కడ రెండు పౌల్ట్రీఫారాలు, భూములు, ప్లాట్లు వున్నట్లు గుర్తించి అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు సమీపంలోని కీలపట్లలో గుర్రప్ప పేరుతో వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన పత్రాలు సీజ్ చేశారు. అక్కడ మురళి బంధువుల ఇళ్లలోనూ సోదాలు జరిపారు. పుంగనూరులో పీడీగా పనిచేసిన కాలంలో చుట్టుపక్కల గ్రామాల్లో ఆస్తులు కూడబెట్టాడనే ఆరోపణలున్నాయి. వైసీపీ హయాంలో జిల్లాకు చెందిన ఒక మంత్రి మద్దతుతో పలు ప్రాంతాల్లో అత్యంత విలువైన ఆస్తులు, భూములు, ఇళ్ళు ప్లాట్లు కొనుగోలు చేసి బంధువులు, స్నేహితుల పేర్ల మీద వుంచినట్లు తెలియడంతో ఆ దిశగానూ అధికారులు సోదాలు చేస్తున్నారు. సోదాలు ఆదివారం కూడా కొనసాగనున్నాయి. మురళీతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులకు సంబంధించిన బ్యాంకు లాకర్లపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు.



తిరుపతిలోని బైరాగిపట్టెడలో మురళీ కుమారుడి ఇంట్లో ఏసీబీ తనిఖీలు

హౌసింగ్ అవకతవకలపై చర్యలుంటాయి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం, కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని, దీనిపై జేసీతో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.తిరుపతి కలెక్టరేట్‌లో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా హౌసింగ్ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ లే అవుట్లలో ఇంటి పట్టాలు చేతులు మారడం, కొన్ని ఇళ్ల నిర్మాణం జరగకపోయినా ప్రభుత్వం నుంచి సొమ్ము డ్రా చేయడం వంటివి జరిగాయని, ఎమ్మెల్యేల ఫిర్యాదు మేరకు విచారణకు ఆదేశించామని చెప్పారు. నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి రాష్ట్రంలో లక్ష ఇళ్లు పూర్తి చేసి, లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. పీఎంఏవై 1.0లో రెండు జిల్లాలకు మంజూరైన గృహాలు 50 శాతం పూర్తయ్యాయని, పలు నియోజకవర్గాల్లో 70శాతం పూర్తయ్యాయని, కొన్నిచోట్ల ఇసుక సమస్య కారణంగా గృహ నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. హౌసింగ్ నిర్మాణానికి ఇసుక ఇవ్వాలని అధికారులకు సూచించామన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు బిల్లు సమర్పించిన వారంలోపే ఖాతాల్లో డబ్బులు పడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన చూడలేకే వైసీపీ సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తోందన్నారు. సమాచార శాఖ అధికారి భూ కుంభకోణానికి పాల్పడ్డాడని మీడియా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకురాగా భూములను ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ పలు సమస్యలను, అవినీతి ఆరోపణలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.జేసీ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, డీఆర్వో నరసింహులు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, హౌసింగ్ సీఈ ప్రసాద్, ఎస్ఈ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

అరాచకవాదులకు బుద్ధినివ్వాలని ప్రార్థించా: పార్థసారథి



తిరుమల, నవంబరు9(ఆంధ్ర జ్యోతి): ప్రస్తుతం క్రూర, అరాచక మనస్తత్వాలున్న వారికి మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీవారిని ప్రార్థించినట్టు రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం ఆయన దర్శించుకు న్నారు. ఈక్రమంలో మంత్రికి వేద పండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. దర్శనం అనం తరం మంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలలో గతంకంటే వస తులు మెరుగుపడ్డాయన్నారు. కొంతమంది భక్తు లతో మాట్లాడానన్నారు. దర్శనం, ప్రసాదాలు, వసతి విష యంలో సంతృప్తి వ్యక్తం చేశా రన్నారు. తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని కూడా మంత్రి దర్శించుకు న్నారు. ● తమ ప్రభుత్వంలో శ్రీవారి దర్శనాల గురించి ఆలో చించాల్సిన అవసరం లేదని చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య అన్నారు. తిరు మల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దర్శనాల విషయంలో ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసు కుంటున్నట్టు చెప్పారు.

భక్తాంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలోని భక్తాంజనేయస్వామి ఆలయం ఆవర ణలో శనివారం శ్రీవారి కల్యాణోత్స వాన్ని వైభవంగా నిర్వహించారు. చంద్రగిరి, నరసింగాపురం, శ్రీనివాస మంగాపురం ప్రాంతాల అయ్యప్ప స్వామి భక్త బృందం, భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. భక్తాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తు లను ప్రత్యేక వైదికపై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా ఽ కల్యాణోత్స వాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ ఆవరణలో పుష్కరిణి నిర్మించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంజ నీర్లు రూ.2 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈమేరకు దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది. విరాళాలు ఇవ్వదలచిన భక్తులు, దాతలు సంప్ర దించాలని కమిటీ కోరింది.

సీఆర్ రాజన్‌కు టీడీపీ నేతల సన్మానం



తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వన్నె కుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన సీఆర్‌రాజన్‌ను నియమిస్తూ శనివారం టీడీపీ నేతలు శాలువ కప్పి సన్మానిం చారు. సన్మానించారు. సత్కరించిన వారిలో అమిలినేని మధు, ఈశ్వర్ రెడ్డి, మధుశేఖర్, శ్రీధర్‌నాయుడు, శ్రీనివాసులు ఉన్నారు. ఆయనను నాయకులు కిషోర్‌రెడ్డి, హరిరామిరెడ్డి, సాయి రాయల్, ఫణి భారీకేక్ కట్‌చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దామి నేడుకుచెందిన రమేష్, మునిరత్నంరెడ్డి తదితరు లు పాల్గొన్నారు.

చెరువులో చేపల మృతిపై ఫిర్యాదు

రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): రాయలచెరువు కట్టకింద ఓ రైతు చెరు వులో రూ.50లక్షల విలువ చేసే చేపలు శుక్ర వారం రాత్రి మృతి చెందాయి. బలిజపల్లెకుచెం దిన మునిరాజా ఏడునెలల క్రితం చెరువులో చేపల పెంపకాన్ని ప్రారంభించారు. చేపలు బరు వుపెరిగి విక్రయించే దశకు వచ్చాయి. ఈక్ర మంలో శనివారం ఉదయం చేపలు మృతిచెంద డాన్ని మునిరాజా గుర్తించి ఆందోళన చెందారు. పోలీసులకు ఫిర్యాదుచేశారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



త్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేనాని

రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డి పల్లిలో రైతు భరోసా కేంద్రం వద్ద ఎమ్మెల్యే నాని శనివారం వేరుశనగ విత్తన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల విత్తనాలను సబ్సిడీపై రైతుకు ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. నియోజ కవర్గంలో రూ.15కోట్ల ఉపాధి నిధులతో మురుగు కాలువలు నిర్మిస్తున్నామన్నారు. కార్య క్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమల రెడ్డి, చిన్నబాబు, జనార్దన్‌చౌదరి, విజయకు మార్, వ్యవసాయాశాక అధికారి స్రవంతి, తహ సీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిర తదిత రులుపాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న పుష్పయాగం



తిరుపతి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆల యంలో శనివారం పుష్పయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిం చారు. 12రకాల పుష్పాలు, 6రకాల పరిమళభరిత పత్రాలతో స్వామివా రికి నివేదన చేశారు. పుష్పాలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఉత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవి రెడ్డి దంపతులతోపాటు గ్రామస్తులు పాల్గొ న్నారు. సాయంత్రం వైదిక కార్యక్రమాలు నిర్వ హించారు. ముందుగా ఉత్సవర్లకు స్నపన తిరు మంజన సేవ నిర్వహించారు.

ఘనంగా చెవిరెడ్డి జన్మదినం



తిరుపతి రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర ప్రధానకార్య దర్శి చెవిరెడ్డి భాస్కరరెడ్డి జన్మది నాన్ని శనివారం తుమ్మలగుంటలో ఘనంగా నిర్వహించారు. భారీకేక్‌ని కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యక ర్తలు, చెవిరెడ్డి ఇంటికి చేరుకుని పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలి పారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

కన్నుల పండువలా ఆకాశదీపం



ఆకాశదీపానికి పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాల యంలో శనివారం ఆకాశదీపం కన్నుల పండు గగా వెలిగించారు. శ్రీకాళ హస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశ దీపాన్ని సంప్రదాయంగా వెలిగి స్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపం డితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపా నికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకు న్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు

శ్రీసిటీని సందర్శించిన టీటీడీ బోర్డు సభ్యుడు

శ్రీసిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి వైద్యనాథన్ ఆయన సతీమణి అనురాధతో కలిసి శ్రీసిటీని సందర్శించారు. వారికి శ్రీసిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. అనంతరం వారు పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు.కాగా కృష్ణమూర్తి వైద్యనాథన్ సతీమణి అనురాధ ఐఐటీ మద్రాస్ కార్యాలయంలో సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

చంద్రగిరి

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీని వాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారి సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహిం చారు. 10.30 గంటలకు ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను జరిగింది. అనంతరం ఉత్సవ ర్లను విశేషంగా అలంకరించి తిరుచ్చి వాహ నంపై మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమా లలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కు మార్, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కు మార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరం గాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచా ర్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, పాల్గొన్నారు.

మరకతశక్తికాళి సేవలో బీఆర్ నాయుడు



బీఆర్‌నాయుడిని ఆశీర్వదిస్తున్న కుర్తాళం పీఠాధిపతి

రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): రాయలచెరువుకట్ట శ్రీశక్తిపీఠంలోని మరకతశక్తి కాళీ అమ్మవారిని శనివారం టీటీడీ చర్మన్ బీఆర్ నాయుడు దర్శించుకు న్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజే శారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనందభార తిస్వామి, శక్తీ పీఠాధిశ్వరి రమ్యానందభారతి లను ఆయన కలిసి ఆశీర్వాదం పొందారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరి ధిలోని అలిపిరి 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేష న్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ చంద్రశేఖర్‌రావు శనివారం ఒక ప్రకట నలో తెలిపారు. రుయా ఆస్పత్రి, మెడికల్ కళాశాల, సైన్స్ సెంటర్, మెటర్నటీ ఆస్పత్రి, మారుతీనగర్, ఇతర సెక్షన్ల పరిధిలో బీఎస్ఎ న్ఎల్ కార్యాలయం, సరోజినీదేవిరోడ్డు, చెన్నా రెడ్డి కాలనీ, అంబేడ్కర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, సింగాలగుంట, కనకభూషణ లేఅవుట్, ఆర్ఎస్ గార్డెన్, త్యాగరాజనగర్, ఇర్లానగర్, మంచాలవీధి, కొంకావీధి, రాములవారి గుడి మాడా వీధులు, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సనఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ తెలిపారు.

ముక్కంటి సేవలో పాట్నా హైకోర్టు జడ్జి



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ ఎం.పాంచోలి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీనగర్‌లో సమస్యల తిష్ఠ

- 400 ఇళ్లకు రెండే బోర్లు
- తాగునీరు అందక అవస్థలు
- నెలల తరబడి పేరుకుపోతున్న చెత్త



గోతులమయమైన లక్ష్మీనగర్ ప్రధాన రహదారి



పేరుకుపోయిన చెత్తకు స్థానికులే చొరవతో ఇటీవల నిప్పు పెట్టారిలా..

రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మా ప్రాంత సమస్యలను పరిష్కరించడంలో తిరుచా నూరు పంచాయతీ సిబ్బంది అలసత్వం వహిస్తు న్నారంటూ లక్ష్మీనగర్‌వాసులు మండిపడుతు న్నారు. రేణిగుంట-తిరుపతి మార్గంలోని కృష్ణ తేజ విద్యాసంస్థల వెనుక వైపు 25 ఏళ్ల క్రితం లక్ష్మీనగర్ ఏర్పడింది. ఇందులో 80 శాతం రైల్వే విశ్రాంత ఉద్యోగులు నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 400 ఇళ్లు ఉండగా 5వేల మంది ఉంటున్నారు. ఇంతమంది జనాభా నివసి స్తున్నా ఇక్కడ రెండు బోర్లు మాత్రమే ఉన్నాయి. మరో మూడు బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకు అవ సరం ఉంది. రెండు రోజులకు ఒకసారి గంట సేపు నీరు సరఫరా చేస్తున్నారు. ఇందులో ఓ బోరులో దాదాపు నీరు ఇంకిపోయింది. మిగిలిన బోరులో పుష్కలంగా నీరు ఉంది. ఓ టీడీపీ నాయకుడు ఇంటి ముందు పైపులైన్‌పై కంకర వేసి ప్లాస్టింగ్ చేయడంతో పైపులైను లీకేజీ అవు తోంది. దీంతో దాదాపుగా 15 రోజులుగా ఈ కాల నీకి తాగునీరు రావడంలేదు. మూడు రోజులకు ఒకసారి ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తు న్నారు. పారిశుధ్యం తీరు కూడా అధ్వానంగా ఉందని లక్ష్మీనగర్‌వాసులు వాపోతున్నారు. నెలల తరబడి మురుగు కాలువలు శుభ్రం చేయ డంలేదని ఆవేదన చెందుతున్నారు. వీధులన్నీ చెత్తతో పేరుకుపోయాయి. ఫలితంగా దోమల బెడదతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ ఈవో సహా ఆయా శాఖల కింది స్థాయి సిబ్బందికి తమ సమస్యన లను నివేదించినా స్పందించడంలేదని లక్ష్మీనగర్ వాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కాలనీ లోని ప్రధాన రహదారి గుంతలమయమైంది. ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించి తమ సమస్య లను పరిష్కరించాలని వీరు కోరుతున్నారు.



కాలువలో ముందుకు కదలని మురుగు

ఆరు నెలల్లో ఇళ్ల కాలనీల అభివృద్ధి : మంత్రి పార్థసారథి



కాలనీ వాసుల నుంచి సమస్యలు తెలుసుకొంటున్న మంత్రి పార్థసారథి

చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తుం దని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. శనివారం తొండవాడ హౌసింగ్ కాలనీలోని లబ్దిదారులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర నిధులతో హౌసింగ్ కాలనీలను అభివృద్ధి చేసి, ఆరు మాసాలు తరువాత మళ్ళీ ఇక్కడికి వస్తాన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇల్లు నిర్మించుకోవడానికి రూ.2.50 లక్షలు ఇస్తే వైసీపీ ప్రభుత్వం దానిని రూ.1.80 లక్షలు చేసిందన్నారు. అలాగే హౌసింగ్‌కు రూ. 19 వేల కోట్లు మంజూరు చేసినా అందులో రూ.4.500 కోట్లు ఎక్కడ ఖర్చు పెట్టారో తెలియడం లేదన్నారు. అప్పుల భారాన్ని మాత్రం ప్రజలపె పెట్టార న్నారు. గతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ప్రారం భిస్తే చంద్రబాబునాయుడుకు పేరు వస్తుందని వైసీపీ ప్రభుత్వం వాటికి బూజు పట్టించింద న్నారు. గత సీఎం హౌసింగ్‌పై కూడా రుణాలు తెచ్చారన్నారు. బ్యాంకర్లు ఇప్పుడు ఆ రుణాలు చెల్లించాలని లబ్ధిదారులను వేధిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలో తాత్కాలికంగా సమస్యలు పరిష్కరిం చామన్నారు. అనంతరం కాలనీ వాసుల సమ స్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధి కారులకు సూచించారు. కార్యక్రమంలో పూతల పట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, జాయింట్ కలె క్టర్ శుభం బన్సల్, హౌసింగ్ సీఈ జీవీ ప్రసాద్, ఎస్ఈ నాగభూషణం, ఆర్డీవో, టీటీడీ మండలా ధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు కుమారరాజారెడ్డి, రమేష్‌రెడ్డి, గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్‌రాయల్, బాలకృష్ణమూర్తి, పులి కంటి మోహన్‌రెడ్డి, తులసేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల సర్వేతో సమసిన భూవివాదం

తిరుపతిరూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాతకాల్వలోని సర్వేనంబర్ 197లో తనభూమికి సంబంధించి తలెత్తిన వివాదం శుక్రవారం సమ సిపోయిందని బాధితురాలు కల్పన పేర్కొన్నారు. గొల్లపల్లె, పాతకాల్వ, పేరూరు రోడ్డుకు ఉత్తరంగా సర్వేనంబర్ 197 రికార్డుల ప్రకారం తన బంధు వుల వద్ద 50సెంట్ల భూమిని 2011లో కొను గోలు చేశానన్నారు. పాతకాల్వకు చెందిన యోగా నందరెడ్డి, గోపీనాథరెడ్డి, పేరూరుకు చెందిన హేమంతాచారి ఆక్రమించేందుకు ప్రయత్నించ డంతో 2016లో కలెక్టర్ ద్వారా సర్వే చేయించి రికార్డులు ఇచ్చారన్నారు. 2019లో వైసీపీకి చెందిన యోగానందరెడ్డి తదితరులు దొంగ డా క్యుమెంట్లు సృష్టించి ఇతరులకు విక్రయించార న్నారు. ఎంఆర్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరుపార్టీల పత్రాలను రూరల్ తహసీ ల్దార్‌కు పంపి భూమిని గుర్తించమని కోరారన్నారు. శుక్రవారం సర్వే చేసి తన భూమి గొల్లపల్లెకు వెళ్లే రోడ్డుకు ఉత్తరంగా ఉందని నిర్ధారించారన్నారు. కొంతమంది ప్లాట్ల యజమా నులు తన భూమిని చూపించి యోగానందరెడ్డి, గోపీనాథ రెడ్డి తదితరులు తమకు విక్రయించి నట్లు చెప్పారన్నారు. సర్వేయర్ ఈ భూమి తన దని తేల్చి చెప్పారన్నారు. ఇరుపార్టీలు కలసి వస్తే రికార్డుల ప్రకారం సర్వేనెంబర్‌లోని తేడాను సరిదిద్దుకోవచ్చని సర్వేయర్ సూచించడంతో ఈ భూవివాదం సమసిందని వరించారు. యోగానం దరెడ్డి, గోపీనాథరెడ్డి తదితరులపై చర్యలు చేప ట్టాలని ప్లాట్ల కొనుగోలుదారులు పోలీసులను కోరినట్లు ఆమె పేర్కొన్నారు.

రాయల చెరువులో వాటర్ స్పోర్ట్స్ ట్రయల్ రన్ పరిశీలన



రాయలచెరువులో బోటుషికారు చేస్తున్న ఎమ్మెల్యే నాని, శాప్ చైర్మన్‌రవినాయుడు

రామచంద్రాపురం, నవంబరు 9(ఆంధ్ర జ్యోతి): రాయలచెరువులో వాటర్ స్పోర్ట్స్ ట్రయల్ రన్‌ను ఎమ్మెల్యే నానితో కలిసి శాప్ చైర్మన్ రవినాయుడు శనివారం పరిశీ లించారు. ఈ సందర్భంగా నాని మాట్లా డుతూ రాయలచెరువు పర్యాటకానికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వాటర్‌స్పోర్ట్స్‌కు పూర్తిగా సహకరిస్తామన్నారు. చెరువులో చేపల పెంపకందారులకు ఇబ్బందులు కలుగ కుండా చూడాలన్నారు. ఎన్నికల హామీ మేరకు రాయలచెరువు పర్యాటకానికి శ్రీకారం చుట్టామన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ రాయలచెరువులో డ్రాగన్ బోటిం గ్‌కు అనుకూలంగా ఉండటంతో ట్రైల్‌రన్ నిర్వ హించామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. తొలుత ఎమ్మెల్యే నాని, రవినా యుడు, అధికారులు, నాయకులు రాయలచెరు వులో బోటుషికారు చేశారు. పార్టీ మండలాధ్య క్షుడు తిరుమలరెడ్డి, నాయకులు చిన్నబాబు, జనార్దన్‌చౌదరి,ఉమాపతినాయుడు, విజయకు మార్, నరసింహారెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆకతాయిల చర్యలతో విద్యుత్ సరఫరాకు ఆటంకం

● పోలీసులకు ఫిర్యాదు చేసిన ట్రాన్స్‌కో అధికారులు

తిరుచానూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు, దామినేడు,నగరంలోని కొరమేనుగుంట, ఆటోన గర్ ప్రాంతాల్లో శనివారం దాదాపు 30 చోట్లకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు స్విచ్ ఆఫ్ చేసి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తాడుతో కట్టి వెళ్లి పోయారు. సరఫరా నిలిచిపోతుండటంతో అధి కారులు లైన్ల మీదకు పరుగులు తీశారు. ట్రాన్స్ ఫార్మర్ల పరిస్థితి చూసి అవాక్కయ్యారు. వెంటనే స్విచ్ ఆన్ చేసి సరఫరా పునరుద్ధరించారు. తాము విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గించే సమయంలో ముందస్తు ప్రకటన చేస్తా మన్న విషయాన్ని వినియోగదారులు గుర్తుంచు కోవాలన్నారు. అందుకు భిన్నంగా విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలిగితే 1912, 83329 87213 నెంబర్లుకు సమాచారం ఇవ్వాలని దామినేడు సెక్షన్ ఏఈ మోహన్, తిరుచానూరు ఏఈ మురళీనాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ట్రాన్స్‌కో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. అనతరం రిమాండ్‌కు తరలిం చారు. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. బుచ్చి నాయుడుకండ్రిగ మండలం నెలవాయికి చెందిన విష్ణువర్ధన్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువు తున్నాడు. ఇటీవల శ్రీకాళహస్తిదర్మరాజుల స్వామి ఆలయం వద్ద మిత్రులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు చేసుకున్నాడు. ఆ సమయంలో నలుగురు యువకులు అతడిపై కత్తితో దాడిచేశారు. 'స్థానికలు విష్ణువర్ధన్‌ను ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తికి చెందిన జగ న్, వాసు, మునిరాజా, భరత్‌కుమార్ హత్యాయ త్నానికి పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న నిత్యాన్న దాన పథకానికి హైదరాబా ద్‌కు చెందిన పుష్పల జయ్‌కుమార్ కుటుంబ సభ్యులు వారి తండ్రి పరమేశ్వరరావు పేరు మీద రూ.లక్ష విరాళంగా అందజేశారు. దీన్ని ఆలయ ఈవో బాపిరెడ్డి స్వీక రించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మ వార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసా దాలు అంద జేశారు. టీడీపీ నాయకుడు సుబ్బయ్య, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గ్రావెల్ టిప్పర్‌లకు జరిమానా

సత్యవేడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో ఇటీవల అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తూ పట్టుపడిన ఐదు టిప్పర్‌లకు రూ.5లక్షల 20వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఎస్‌ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు బృందం స్థానిక వీర్‌కండ్రిగ వద్ద వాహన తని ఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని మదనంజేరి గ్రామ సమీపంలోని క్వారీ నుంచి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌లను ఆపి రికా ర్డులు పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేక పోవ డాన్ని గుర్తించారు. సీఐ మురళి ఆదేశాల మేరకు టిప్పర్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా మైన్స్, మోటార్ వెహికల్స్ శాఖ సూచ నల మేరకు ఒక్కో టిప్పర్‌కు రూ. లక్షా 4వేలు చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఎంపిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలకు చెందిన ఆచార్యులను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఎంపిక చేసింది. ఇందులో ఎస్వీయూ హోంసైన్స్ విభాగ ప్రొఫెసర్ సుచరిత, జువాలజీ విభాగ ప్రొఫెసర్ రాజశేఖర్, పద్మావతి వర్సిటీ లా విభాగ ప్రొఫెసర్ సీతాకుమారి, ఫార్మసీ విభాగ ప్రొఫెసర్ మాధవి, బయోటెక్నాలజీ ప్రొఫెసర్ ఉష ఉన్నారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వీరు చేసిన విశేష కృషిని గుర్తించి ఉత్తమ అధ్యాపక అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి త్వరలో పుర స్కారాలను ప్రదానం చేస్తారు.



సీతాకుమారి - ఉష - మాధవి - సుచరిత - రాజశేఖర్

సీఎం ఫ్యామిలీ ఫొటోల మార్ఫింగ్ కేసుల్లో ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం)/వెదురుకుప్పం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వైసీపీ సానుభూతిపరుడు సంజీవరెడ్డిని శనివారం తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణ కథనం మేరకు.....అనంతపురం జిల్లా బెలుగుప్పకు చెందిన సంజీ వరెడ్డి కొంత కాలంగా తిరుపతిలో వుంటున్నాడు.ముఖ్య మంత్రితో పాటు ఆయన భార్య,కోడలి ఫొటోలు అశ్లీలంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.దీనిపై టీడీపీ నాయకుడు మధుబాబు ఫిర్యాదు చేయడంతో శని వారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ముఖ్య మంత్రి సతీమణి భువనేశ్వరి ఫొటోలను సోషల్ మీడి యాలో అసభ్యకరంగా పోస్టు చేశారంటూ ఇచ్చిన ఫిర్యా దుతో హైదరాబాద్‌కు చెందిన కార్నె సైదిరెడ్డిపై కార్వేటిన గరం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా శనివారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

టీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోండి

మాజీ సీఎం జగన్‌పై తప్పుడు పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియాకు చెందిన వ్యక్తులను గుర్తించి చర్య లు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి శనివారం ఏఎస్పీ రవిమనోహరాచారిని కలసి వినతి పత్రం అందచేశారు.దీనికి సంబంధించి ఫేస్ బుక్ లింక్‌లను అందజేశారు.

ఒంటిమిట్ట స్మగ్లర్ అరెస్టు

కారు సహా ఎర్రచందనం స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్‌ను చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు పరిధిలోని జాతీయ రహదారివద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి కారుతో సహా ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా టాస్క్‌ఫోర్సు సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం, అటవీశాఖకు చెందిన ఎఫ్‌బీవో నాగేశ్వర నాయక్ బృందాలు రైల్వేకోడూరు రెడ్డిపల్లి చెరువు సమీపంలో శనివారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అధికారులను గమనించిన ఇద్దరు స్మగ్లర్లు కారును పక్కకు ఆపి దిగి పారిపోవడానికి ప్రయత్నించగా, టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతడిని కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో దాచిన ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన స్మగ్లర్‌ను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కపిలతీర్థంలో శాస్త్రోక్తంగా నవగ్రహ హోమం



తిరుపతి(కల్చరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలలో భాగంగా శనివారం నవగ్రహ హోమం నిర్వహించారు. యాగశాలలో ఉదయం నవగ్రహ హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, నవగ్రహ కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం కామాక్షి అమ్మవారి కలశస్థాపన, విశేష దీపారాధన జరిగింది. ఈ ఉత్సవాలలో భాగంగా 10వతేది ఆదివారం నుండి 18వ తేది వరకు కామాక్షి అమ్మవారి హోమం (చండీ యాగం) నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రుద్రకోటికి సన్మానం



తిరుపతి (కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షులుగా నియమితులైన రుద్రకోటి సదాశివంను బీజేపీ సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు శనివారం సత్కరించారు. రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు ఈపదవి ఇవ్వడం సంతోషంగా ఉందని, ఇందుకు కృషిచేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాయీ బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించి, వారు ఆర్థికంగా ఎదగడానికి చదానికి కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఆవులపాటి మురళీకృష్ణ, తూముగుంట నారాయణగిరి, వాసు, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

వండర్ బుక్ ఆఫ్ రికార్డు కోసం...

24న 2024 మందితో బ్రహ్మమొక్కటే పర బ్రహ్మమొక్కటే సంకీర్తన

తిరుపతి (జీవకోన), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సును సాధించడమే లక్ష్యంగా ఈ నెల 24వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్వీ యూనివర్శిటీ ఆవరణలోని జ్ఞానప్రద వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బ్రహ్మమొక్కటే, పరబ్రహ్మమొక్కటే అనే అన్నమయ్య సంకీర్తనకు కోలాట నృత్య కార్యక్రమాన్ని తలపెట్టినట్లు శ్రీఅన్నమయ్య డ్యాన్స్ అకాడమి, ఆర్కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు డాక్టర్ సి.శ్రీరామ్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2024వ సంవత్సరంలో 2024 మందితో అపస్మా నాయకుడు రవిచంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరుల సారథ్యంలో ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, కళాకారులు, వివిధ రంగాలకు చెందిన వారితో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పాల్గొనే విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో హాజరుకావాలనికోరారు. సమావేశంలో అపస్మా విద్యాసంస్థల ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 104 ఉద్యోగుల నిరసన

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ జి.నాగ వెంకటేష్ వెల్లడించారు. స్థానిక యశోదానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న 104 ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం అరబిందో యాజమాన్యానికి అప్పగించిందని, మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆరోపించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు జయచంద్ర, టి.రామకృష్ణ, పి.అమర్‌నాథ్, బత్తిరెడ్డి, మురళీమోహన్, యోగానంద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నా అడుగు ఎప్పుడూ ముందుకే పుస్తకావిష్కరణ నేడు

తిరుపతి(కల్చరల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన డాక్టర్ వి.ఎస్.రమేష్‌బాబు ఆత్మకథ నా అడుగు ఎప్పుడూ ముందుకే పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులోని రాస్ భవనంలో జరుగనుంది.







కళా విన్యాసం

యువ తరంగ్‌లో రెండో రోజూ జోరుగా సాంస్కృతిక ప్రదర్శనలు











తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో యువ తరంగ్ జోరుగా హుషారుగా సాగుతోంది. రెండో రోజైన శనివారం కళాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కళా విన్యాసాలను న్యాయ నిర్ణేతలు తిలకించారు. నేటితో కార్యక్రమం ముగియనుంది.

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు

యువ తరంగ్‌లో రెండో రోజైన శనివారం వివిధ సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. శాస్త్రీయ గానం, తాళం, లయ వాయిద్యాలు, సంగీత స్వర వాయిద్యాలు, లలిత సంగీతం, పాశ్చాత్య గానం, నృత్యం, ఫోక్ డ్యాన్స్, వక్తృత్వం, డిబేట్, స్పాట్ పెయింటింగ్, మట్టి బొమ్మల తయారీ తదితర పోటీలు నిర్వహించారు. సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

నేడు సమాపనోత్సవం

యువ తరంగ్ సమాపనోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు తదితరులు పాల్గొంటారు. ఈ మేరకు వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తెలిపారు.

క్యాన్సర్ గడ్డ తొలగింపు

తిరుపతి(వైద్యం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అరుదైన క్యాన్సర్ గడ్డతో బాధపడుతున్న 65ఏళ్ల వ్యక్తికి అతిక్లిష్టమైన సర్జరీని విజయవంతంగా పూర్తిచేసి రోగి ప్రాణాలు నిలబెట్టామని శ్రీమారుతీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మారుతీకృష్ణ తెలిపారు. స్థానిక బస్టాండు సమీపంలోని ఆస్పత్రిలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... శ్రీకాళహస్తికి చెందిన వ్యక్తి తీవ్రమైన ఆయాసం, దగ్గు, ఛాతీ నొప్పితో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చారని చెప్పారు. అంతర్జాతీయ పల్మనాలజిస్టు డాక్టర్ నరసింహ ఆ రోగిని పరీక్షించి, ఛాతీ మధ్యభాగంలో క్యాన్సర్ గడ్డ ఉండటాన్ని గుర్తించారని అన్నారు. వెంటనే అనస్థీషియన్ డాక్టర్ మహేష్ సహకారంతో సర్జరీని విజయవంతంగా పూర్తి చేసి క్యాన్సర్ గడ్డను తొలగించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తి ఆరోగ్యంగా కోలుకున్నాడని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వైద్య నిపుణులు, వైద్య పరికరాలు తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉండటంతో అతిక్లిష్టమైన సర్జరీలను చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. రోగి ప్రాణాలు నిలబెట్టిన శ్రీమారుతీ ఆస్పత్రి యాజమాన్యానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు.



శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న రోగితో మారుతీ ఆస్పత్రి వైద్య బృందం

అలరించిన నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం నగరసంకీర్త కార్యక్రమం నిర్వహించారు. వేకువ జామున గోవిందరాజస్వామి గుడి సన్నిధివీధి ఎదురుగా ఉండే ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి గోవిందరాజ స్వామి ఆలయం నాలుగు మాడవీధుల్లో నగర సంకీర్తన సంప్రదాయ రీతిలో నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, భక్తులు, గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలి

ఏఐటీయూసీ డిమాండ్

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నేత నాగసుబ్బారెడ్డి, సీపీఐ నేత పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగిస్తూ భవన నిర్మాణ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారానికై ఈ నెల 11వ తేదీన అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ఆటో కార్మికులకు, ఆశా వర్కర్లకు, వీధి వ్యాపారులకు, బజారు, ఎఫ్‌సీఐ గిడ్డంగులు, సివిల్ సప్లయిస్ గిడ్డంగుల్లో పని చేసే హమాలీలను కార్మిక సంక్షేమ బోర్డులో కలపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కె.రాధాకృష్ణ, ఎన్‌డి రవి, శ్రీరాములు, రామచంద్రయ్య, గోవిందస్వామి, కేవై రాజా, ఉదయ్‌కుమార్, వైఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసు బృందాలు

రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి ఇటీవల వరుసగా బాంబు బెదిరింపులు రావడంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం శనివారం తెల్లవారుజామున 1.30గంటలకు ఆక్టోపస్, సీఐఎస్ఎఫ్, పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలోకి ప్రయాణికుల ముసుగులో తీవ్రవాదులు ప్రవేశిస్తే ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై డ్రిల్ చేశారు. అదే సమయంలో విస్ఫోటనాలు జరిగితే ప్రాణనష్ట నివారణకు తీసుకోవాల్సిన అంశాలపైనా మాక్‌డ్రిల్ చేశారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణబాబు, సీఐ రాంబాబు, సీఐఎస్ఎఫ్ కమాండంట్ శుక్ల, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు

తిరుమల, నవంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.49 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 64,983 మంది భక్తులు దర్శించుకున్నారు. 25,324 మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీవారి సేవలో హీరో నిఖిల్...



సినీ యువ హీరో నిఖిల్ శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన నిఖిల్‌ను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు. ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కళ్యాణ వైభోగమే



ఆకాశం దిగివచ్చి మబ్బులతో వెయ్యాలి మన పందిరి..ఊరంతా చెప్పుకునే ముచ్చటగా సాగాలి పెళ్లంటే మరి..

అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినిమాపాటలో. ఎవరెన్ని చెప్పినా పెళ్లంటే సందడికి ప్రత్యామ్నాయమే. అందుకే పెళ్లి అనగానే ఎంత హడావుడి పడుతుంటారో. ఇదంతా ఒక సంగతయితే కొన్ని రోజులుగా పెళ్లి సందడి కనిపించడం లేదు. కారణం ముహూర్తాలు లేకపోవడమే. మూడు నెలలపాటు మూఢం రావడంతో శుభ కార్యాలయాలకు సెంటిమెంటు అడ్డొచ్చింది. ఆశ్వయుజ మాసంలో కొన్ని ముహూర్తాలున్నా చాలామంది దీపావళి తర్వాత వచ్చే కార్తీకమాసం ముహూర్తాలపైనే ఆసక్తి చూపుతున్నారు. మార్గశిర మాసంలో కూడా మంచి బలమైన ముహూర్తాలున్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో వధూవరుల తల్లిదండ్రులు ఈ రెండు నెలల ముహూర్తాల్లోనే వివాహం చేయాలని సిద్ధపడుతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మోగనున్న పెళ్లి బాజాలు

ఈ రెండు నెలల్లో ఎక్కువ శుభ ముహూర్తాలు

ఇప్పటికే బుక్ అయిన కళ్యాణ మండపాలు

పురోహితుల నుంచి ఫొటోగ్రాఫర్ల వరకూ డిమాండ్

ఇప్పుడు కాకుంటే మాఘం వరకూ ఆగాల్సిందే..

పెళ్లిళ్లకే కాదు వివిధ ఉపనయనాలు, గృహ ప్రవేశాలు లాంటి శుభ కార్యక్రమాలకూ ఈనెల 10 నుంచి 28వరకూ, అలాగే డిసెంబరు 4 నుంచి 16వ తేదీ వరకు అంటే సుముహూర్తాలు ఉన్నాయి. ఈ ముహూర్తాల తర్వాత మాఘమాసం వరకూ ఆగాల్సిందే. అందుకే అందరూ త్వర పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూఢంలో ముహూర్తాలు లేక దిగాలు పడిన వారందరిలో ఇప్పుడు జోష్ కనిపిస్తోంది. వివాహ సంబంధ వ్యవహారాలతో ముడిపడినవారంతా బిజీబిజీగా కనిపిస్తున్నారు. కళ్యాణ వేదికలకు చాలా డిమాండ్ ఏర్పడింది. ఈమధ్యనే పెళ్లి కుదుర్చుకున్న వారు వేదిక దొరక్క దూరంగా వెళ్లయినా చేయాలనుకుంటున్నారు.

అందరూ బిజీబిజీ

గతంలో పెళ్లంటే హంగూ ఆర్భాటం ఉండేది కాదు. ఇప్పుడు అన్ని వర్గాలవారూ వివాహం అందరూ గుర్తుంచుకునేలా చేయాలని ఆరాటపడుతున్నారు. ఇందుకోసం ఎంతయినా వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు,బాజా భజంత్రీలవారు,కేటరింగ్, బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, షామియానా,కుర్చీలు సప్లయర్స్, ఆకర్షణీయ డెకరేటర్లు ఒకరేమిటి ఇలా చాలామంది వెంటపడాల్సి వస్తోంది. ఈ శ్రమ లేకుండా తామే అన్ని చూసుకుంటామంటూ ఈవెంట్ మేనేజర్లు పుట్టుకొచ్చారు. శుభ కార్యక్రమాలకు దివ్యమైన ముహూర్తాలు దగ్గర పడుతుండటంతో వీరందరికీ గిరాకీ ఏర్పడింది. రానున్న ముహూర్తాల్లో దాదాపు 10వేలకు పైగా పెళ్ళిళ్లు జరగనున్నాయని అంచనా.

తిరుపతిలో కళ్యాణ మండపాలకు డిమాండ్

తిరుపతిలో పెళ్లి చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి కనపరుస్తున్నారు. ఇప్పటికే టీటీడీ కళ్యాణ మండపాలతో పాటు ప్రయివేటు, కార్పొరేట్, చిన్నా చితకా మండపాలు, మాల్స్ అన్నీ బుక్ అయిపోయాయని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని మండపాల నిర్వాహకులు పెళ్ళి చేసే వారికి ఇబ్బంది లేకుండా కేటరింగ్, బ్యాండు మేళాలు, భోజనాలు, డెకరేషన్, పురోహితులు, ఇలా సర్వం ప్యాకేజీ రూపంలో ఏర్పాటు చేస్తున్నారు. మండపాల స్థాయిని బట్టి రూ.60 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తున్నారు. మరోపక్క బంగారు దుకాణాలు కొనుగోలుదారులతో సందడి సందడిగా కనిపిస్తున్నాయి. బట్టల షాపులూ రద్దీగానే ఉన్నాయి. నాణ్యత, మన్నికలను బట్టి పట్టుచీరలకు రేట్లు వసూలు చేస్తున్నారు. కనీసం రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకు పట్టుచీరల ధరలు పలుకుతున్నాయి.

శుభ ముహూర్తాలు ఇవీ....

ఈనెల నుంచి మార్చి వరకు వివాహాది శుభ కార్యాలకు ముహూర్తాలున్నాయి.

ఈ నెలలో 10,14,16,17,20,22,27,28 తేదీలు

డిసెంబరు: 4,5,6,7,8,11,12,14,15,19,20,21,26,27,28

జనవరి : 31వ తేదీ మాత్రమే

ఫిబ్రవరి: 2,6,7,8,9,12,13,14,15,16,21,22,23,26

మార్చి: 2,6,9,12,15,16.

వివాహాలకు అనుకూలం

నవంబరు, డిసెంబరు నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. భాద్రపద మాసంలో వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు లేవు.. డిసెంబరు నెలాఖరు వరకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే విశేష ముహూర్తాలకు అంత బలం.

-సత్యనారాయణ మూర్తి, పురోహితులు

ధరలతో ఆందోళన

ఐదారు సంవత్సరాలతో పోలిస్తే క్యాటరింగ్ సంస్థలు పెరిగాయి. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, ఆయిల్, బియ్యం, పప్పుల ధరలు దారుణంగా ఉన్నాయి. గతంలో ధరలకు భోజనం సమకూర్చాలంటే కష్టమే. ఇదే భయం మమ్మల్ని వెంటాడుతోంది. ఎలా ఉన్నా ఈ రెండు నెలలూ క్యాటరింగ్ నిర్వాహకులకు చేతినిండా పని ఉంటుంది

-కృష్ణమూర్తి, ఎస్కే క్యాటరింగ్, తిరుపతి

ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చిన్నబాబు



చంద్రగిరి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనపాకం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చిన్నబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఎన్నికల అధికారి సురేష్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా లక్ష్మీప్రసాద్ జనరల్ సెక్రటరీగా శంకరప్ప, జాయింట్ సెక్రటరీగా రెహానా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మధులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా చిన్నబాబు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యుల సమస్యలను ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం



వీరాంజనేయులు (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. బాపట్లకు చెందిన ముత్యాల వీరాంజనేయులు(50) వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. బాపట్ల జిల్లాకు చెందిన అతని స్నేహితులు రంగారావు(52), గంధం కృష్ణమూర్తి(53)తో కలిసి కారులో బెంగళూరుకు శుక్రవారం బయలుదేరారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై ఓ లారీ మరమ్మతులకు గురికావడంతో రోడ్డుపక్కన నిలిపివేశారు. శనివారం వేకువజామున 2గంటల ప్రాంతంలో బెంగళూరు వైపుగా వెళుతున్న వీరి కారు ఆగివున్న లారీని ఢీకొంది. వాహనం నడుపుతున్న వీరాంజనేయులు, రంగారావు, కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరాంజనేయులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. వీరాంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పీఎఫ్ నిధులు స్వాహా

మ్యాన్ పవర్ ఏజెన్సీపై కార్మికుల ఫిర్యాదు


సత్యవేడు, నవంబరు 9: కార్మికులు కాయ కష్టం చేసి దాచుకున్న పీఎఫ్ సొమ్మును ఓ మ్యాన్ పవర్ ఏజెన్సీ స్వాహా చేసింది. దీంతో కార్మికులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన శ్రీసిటీ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీసిటీ పరిధిలోని ఐఎఫ్ఎఫ్ పరిశ్రమలో కొంత మంది కార్మికులు తమిళనాడుకు చెందిన వీపీజీ అనే మ్యాన్ పవర్ ఏజెన్సీ కింద పని చేస్తున్నారు. తమ వేతనం డబ్బుల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్ నగదును దిగమింగేశారని పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు శనివారం శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023కు సంబంధించిన పీఎఫ్ సొమ్ముతో పాటు, తమకు రావాల్సిన బోనస్ నగదును స్వాహా చేసేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు రూ.20 లక్షలకు పైగా కార్మికుల పీఎఫ్, బోనస్ డబ్బులు కాజేశారని సమాచారం. ఈ వ్యవహారంలో పరిశ్రమలో కీలక విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు రావాల్సిన పీఎఫ్, బోనస్ నగదును తమ ఖాతాల్లో జమ చేసి న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

పుత్తూరులో నకిలీ నోట్ల కలకలం

- రూ.30 వేల రూ.500 నకిలీనోట్ల చలామణి
- తండ్రీకూతుళ్లు నిందితులు
- పోలీసులకు అప్పగించిన స్థానికులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 09(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో నకిలీ నోట్ల చలామణి కలకలం సృష్టించింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో నకిలీ నోట్ల చలామణి చేస్తున్న తండ్రీకూతుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 వేల వరకు రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పుత్తూరులో బిజీబిజీగా ఉండే బజారు వీధి తదితర ప్రాంతాల్లోని చిల్లర దుకాణాలే లక్ష్యంగా నకిలీ నోట్ల మార్పునకు వీరు శ్రీకారం చుట్టారు. బాధితుల కథనం మేరకు.. ఓ ఫైనాన్సర్ దుకాణాల నుంచి రోజువారీ ఫైనాన్స్ నగదును కలెక్షన్ చేసుకుని తన వద్ద ఉన్న లెక్కింపు మిషన్‌తో లెక్కించారు. వాటిలో రూ.500 నోట్లు నకిలీవిగా గుర్తించారు. అప్రమత్తమైన ఫైనాన్సర్ సదరు దుకాణదారులకు సమాచారం అందించారు. అప్పటికే పలు దుకాణాలలో దాదాపు రూ.30 వేలకు పైగా రూ.500 నకిలీ నోట్లను తండ్రీ, కూతురు మార్పు చేశారు. రూ.50లకు చిన్నపాటి సరుకులు కొనుగోలు చేసి రూ.450 నగదును తిరిగి పొందేవారని గుర్తించారు. ఫైనాన్సర్ సమాచారంతో దుకాణదారులందరూ ఏకమై వారి కోసం జల్లెడపట్టారు. పుత్తూరు పోలీస్ స్టేషన్ ఎదుట వెళుతున్న వారిని గుర్తించి కానిస్టేబుల్ మురళికి సమాచారం ఇచ్చారు. వారిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులు వద్ద ఉన్న నకిలీ రూ.500ల నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తిరుచానూరులో కాపురం ఉన్నట్లు వెల్లడైంది. తిరుపతిలో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఈ నకిలీ నోట్లను పొందినట్లు విచారణలో తేలింది. దీంతో అసలు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సీఐ సురేంద్రనాయుడు వెల్లడించారు.

రోడ్డుప్రమాదంలో ఆటో డ్రైవర్ దుర్మరణం



మునీంద్ర(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ కథనం మేరకు.. తిరుచానూరు సమీపంలోని యోగిమల్లవరం గ్రామానికి చెందిన మునీంద్ర(35) ఆటో డ్రైవర్. ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై ఆటోలో వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మునీంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఊరందూరు వద్ద మృతదేహాన్ని సుమారు మూడు గంటల పాటు అక్కడే ఉంచేశారు. మృతదేహాన్ని తరలించడంలో జాప్యం జరగడంపై ఉన్నతాధికారులు శ్రీకాళహస్తి రూరల్‌పోలీసులను మందలించినట్లు సమాచారం.

ముక్కంటి ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



రమేష్‌రాజు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి చెందిన ఒప్పంద ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించాడు. విధులకు అనధికారికంగా గైర్హాజరు అవుతున్నాడని రమేష్‌రాజు అనే ఒప్పంద ఉద్యోగిని అధికారులు నెల రోజుల క్రితం సస్పెండ్ చేశారు. అయితే తనను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు అధికారులు స్పందించడంలేదని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్యూటీ లేక కుటుంబ పోషణ భారం కావడంతో ఆత్మహత్యకు యత్నించినట్లు రమేష్‌రాజు వాపోయాడు.

వెటర్నరీ వర్సిటీలో అధ్యాపకుల బదిలీలు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఏపీరాష్ట్రంలో తిరుపతికేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్‌లో భాగంగా పలువురు ప్రొఫెసర్లు, సైంటిస్టులు, అధ్యాపకులకు బదిలీలు చేపట్టారు. తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ, ప్రొద్దుటూరులోని వెటర్నరీ కాలేజ్, గన్నవరంలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల, వెంకట్రామన్నగూడెం, విశాఖపట్నం, రామచంద్రాపురం, వెన్నెలవలస, గుంటూరు కేవీకేలో పనిచేసే దాదాపు 26మందిని గిరివిడికి బదిలీ చేస్తూ శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శనివారం పలువురు రిలీవ్ అయినట్లు తెలిసింది.

రేపు జాబ్‌మేళా

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతిపురంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్సు, బయోడేటా ఫాంతో సంబంధిత లింక్‌లో నమోదు చేసుకుని, అడ్మిట్ కార్డుతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8555972657ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడా రంగానికి పూర్వవైభవం : శాప్ చైర్మన్



పోటీలను తిలకిస్తున్న రవినాయుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శనివారం శ్రీనివాస క్రీడా సముదాయంలో ఫస్ట్ ఓపెన్ సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రవినాయుడు మాట్లాడుతూ తిరుపతిని క్రీడా వేదికగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న క్రీడా వేదికలను డీఎస్ఏ(డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ)ఆధీనంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2027లో రాష్ట్రంలో నేషనల్స్ గేమ్స్ నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, తొలి రోజు అండర్ 12 వ్యక్తిగత కట, కుమితే విభాగాలలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్, టీడీపీ సీనియర్ నాయకులు వూకా విజయకుమార్, మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలు

రేణిగుంట, నవంబరు9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-17, 19 ఘట్కా క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి విశ్వనాథ్‌నాయక్, స్టేట్ పర్యవేక్షణ అధికారి బాలశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు, 30 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. అందరికీ భోజన వసతి కల్పిస్తున్నట్లు హెచ్‌ఎం విష్ణువర్ధని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఘట్కా కార్యదర్శి సురేంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రేఖరాణి తదితరులు పాల్గొన్నారు.



ఘట్కా పోటీలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

మా భూములు మాకు అప్పగించండి



కళత్తూరులో టవర్ ఎక్కిన దళిత రైతులు

- టవర్ ఎక్కిన కళత్తూరు దళిత రైతులు



గ్రామస్తులను అడిగి వివరాలు తెలుసుకున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

కేవీబీపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): భూముల్లోకి వెళ్లకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారంటూ మండలంలోని కళత్తూరు దళిత రైతులు శనివారం ఉదయం సెల్ టవర్ ఎక్కారు. వారు మాట్లాడుతూ కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెంబరు.4 లోని భూములను కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పది సంవత్సరాల నుంచి అటవీ, రెవెన్యూ అధికారులు ఈ భూములు తమవంటే తమవంటూ అడ్డంకులు కల్పిస్తున్నారన్నారు. రెవెన్యూ వారు ఏకంగా ఆ భూముల్లో కొంతమందికి పట్టాలు సైతం ఇచ్చారని తెలిపారు. ఇటీవల ఆ భూముల్లోకి ప్రవేశించిన రైతులపై అటవీ శాఖ వారు కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేసేవరకు దిగేది లేదని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి తహసీల్దారు భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, పిచ్చాటూరు ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను కిందకు దించడానికి ప్రయత్నించారు. వారు ససేమిరా అనడంతో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశ్వర్లు వంద రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో దిగి వచ్చారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను ఎవరూ అడ్డుకోరని చెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దారు మునిరత్నంరెడ్డి, పోలీసు సిబ్బంది అమరనాథనాయుడు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ఓటర్లుగా పలువురి నమోదు



బీఎల్వోలకు సూచనలు చేస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో ఓటర్ల నమోదు, సవరణ, తొలగింపు ప్రక్రియలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. శనివారం పట్టణంలోని 43 పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం యువత దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పోలింగ్ బూత్‌లను తనిఖీ చేశారు. ఆదివారం కూడా బీఎల్వోలు ఆయా పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 23, 24వ తేదీలలో కూడా ప్రత్యేక శిబిరం ఉంటుందని తెలియజేశారు.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటా



బాగు చేయించిన వాహనాన్ని పార్టీ నాయకురాలు నాగరత్నానికి అందజేస్తున్న విజయ్‌బాబును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

పుత్తూరు అర్బన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న పార్టీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి నాగరత్నం కుమారుడి ద్విచక్ర వాహనాన్ని రూ.20 వేలు ఖర్చుతో బాగు చేయించారు. ఆ వాహనాన్ని శనివారం నాగరత్నానికి అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పలువురు విజయ్‌బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి రవినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, సూపర్ బజార్ చైర్మన్ చంద్రయాదవ్, టీడీపీ నాయకులు అనిల్ యాదవ్, పుష్పావతి, పోతుగుంట రమేష్, అములు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగిఉండాలి

నారాయణవనం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ చెప్పారు. మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాల నివారణ వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై నిపుణులు నరసింహారావు చేత అవగాహన కల్పించారు. నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు, సురేంద్రనాయుడు, రవీంద్ర, ఎస్‌ఐలు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలనలో ప్రభుత్వాలు విఫలం: సీపీఎం

పుత్తూరు టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలనలో విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేష్ విమర్శించారు. పాలనా వైఫల్యాలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ప్రజాపోరు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యవసర వస్తువులు, కూరగాయలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. ఈ నెల 14 వరకు ప్రజా సమస్యలను కరపత్రాల ద్వారా వివరిస్తామని పేర్కొన్నారు. 14వ తేదీ మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, నందయ్య, మునిశంకర్, విజయ్, యాసిన్‌బాషా, కృష్ణమూర్తి, హరిచంద్ర, నరసింహులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో బతుకులు చిన్నాభిన్నం

పుత్తూరు టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో బతుకులు చిన్నాభిన్నమవుతాయని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. శనివారం స్థానిక హిమాజా కళాశాలలో న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానవ అక్రమ రవాణా పట్ల అప్ర మత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, విద్యార్థులను అక్రమ రవాణా చేస్తుం టారని హెచ్చరించారు. ఈ సదుస్సులో పుత్తూరు ఎస్‌ఐ ఓబయ్య, విద్యార్థులు, డిగ్రీ కళాశాల చైర్మన్ సురేంద్రరాజు, ప్రిన్సిపాల్ శ్రీధర్, లోకనాథం రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పురుషోత్తం, న్యాయవాది మురుగేషన్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

నారాయణవనం, నవంబర్ 9(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని వెలసిన పద్మావతీ సమేత కళ్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శనివారం సాయంత్రం ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంలో మాడవీధుల్లో విహరించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి కల్యాణ వెంకన్నతిరుచ్చి వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ అధికారి నాగరాజు, జమేదార్ మల్లికార్జున, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహాలు మంజూరు చేయండి



సూళ్లూరు పేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కా గృహాలు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. శనివారం తిరు పతిలో జరిగిన గృహనిర్మాణ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిని కోరారు.

రోడ్డు ప్రమాదంలో నేపాల్‌వాసి మృతి

తడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నేపాల్‌వాసి మృతి చెందాడు. నేపాల్ దేశం మత్తపురేచ్చే జాతలిక గ్రామానికి చెందిన డమ్మరే పరియార్(53) పూడికుప్పం జాతీయ రహదారి వద్ద షాపులో పని చేస్తుంటాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తాను పనిచేసే షాపు నుంచి బయటకువచ్చి అవతలి వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో డమ్మరే పరియార్ తీవ్రంగా గాయపడడంతో వెంటనే సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అష్ట దేవాలయాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ప్రతి సోమవారం అష్టదేవాలయాల సందర్శన యాత్ర కోసం ప్రత్యేక బస్సులు నడుతున్నట్లు సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లి కార్జున్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 4:30 గంటలకు సూళ్లూరుపేట బస్టాండు నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. సురుటుపల్లి, నాగలాపురం, కైలాసకోన, నారాయణవనం, ముక్కోటి, శ్రీనివాసమంగాపురం, కపిలతీర్థం, శ్రీకాళహస్తి అష్ట దేవాలయాల సందర్శన అనంతరం రాత్రి9:30 గంటలకు సూళ్లూరుపేటకు చేరు కుంటుందని డీఎం పేర్కొన్నారు. భక్తులు ముందుగా రిజర్వేషన్ చేసుకోవడంతో పాటు బస్సులో కూడా టికెట్లను తీసుకోవచ్చునన్నారు.

వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ వెంకటరమణయ్య(26) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని తన్నమాల గ్రామానికి చెందిన వెంకట రమణయ్య ఆటోలో గూడూరు వైపు వెళ్తుండగా తుమ్మూరు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





కృష్ణాపురం గిరిజనకాలనీ, ఏరూరు అల్లీపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ అద్దె భవనాలు

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

వసతులు లేక విద్యార్థులు, సిబ్బంది అవస్థలు

చిల్లకూరు, నవంబరు 9: చిల్లకూరు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వాటిల్లో అరకొర వసతులు ఉండడంతో చిన్నారులతో పాటు సిబ్బందికీ ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలోని 74 అంగన్‌వాడీలు, 11 మినీ అండన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 13 కేంద్రాలను అద్దె భనాల్లో నిర్వహిస్తున్నారు. వాటిల్లో వసతులు సక్రమంగా లేకపోవడంతో చిన్నారులతో పాటు సిబ్బంది అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు - నేడు పథకం ద్వారా అరకొర పనులు చేసి నిధులు కాజేశారే తప్ప అంగన్‌వాడీ భవనాల అభివృద్ధి చేపట్టలేదని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీలకు నూతన భవనాలకు నిర్మించి, వసతులు కల్పించాలని కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి: పాశం



ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. పలు సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు వినతులను అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం టీడీపీ నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలు సంక్షేమానికి టీడీపీ అండగా నిలుస్తుందన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి ప్రమాద బీమా రూ.5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే గూడూరు నియోజకవర్గాన్ని మొదటిస్థానంలో నిలిపేందుకు కృషిచేయాలన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు పరుస్తూ ప్రజాదరణ పొందుతోందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాంగోపాల్ రెడ్డికి నివాళి

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విశ్రాంత తెలుగు అధ్యాపకుడు రాంగోపాల్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం సూళ్లూరుపేటలో జరిగాయి. సూళ్లూరుపేట జూనియర్, డిగ్రీ కాలేజీల్లో తెలుగు అధ్యాపకుడిగా సుదీర్ఘ కాలం పనిచేసిన ఈయన శుక్రవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహానికి శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, సూళ్లూరుపేట హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదూరు శ్రీనివాసులు, ఎల్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, ఉష్మాన్ బాషా, డాక్టర్ అనురాధా, ఆర్ఎంఎస్ భాస్కర్ బాబు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాంగోపాల్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి

పాఠశాలకు ఫ్లోర్‌మ్యాట్స్ వితరణ



పాఠశాలకు ఫ్లోర్‌మ్యాట్స్ అందజేస్తున్న దాతలు

గూడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు వాకాటి రామ్మోహన్, పసుపులేటి ప్రసాద్ దాతృత్వంతో ఫ్లోర్‌మ్యాట్స్‌ను శనివారం వితరణగా అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన ఫ్లోర్‌మ్యాట్స్‌ను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతూ మృతిచెందిన ఓ వృద్ధుడి మృతదేహానికి శనివారం మెగా బ్రదర్స్ సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధాశ్రమంలో ఆశ్యయం పొందుతున్న కృష్ణయ్య(85) అనారోగ్య కారణంగా శనివారం మృతిచెందాడు. ఈ విషయాన్ని ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణి మెగా బ్రదర్స్ సేవాసమితి నిర్వాహకుడు తీగల చంద్రశేఖర్‌కు తెలియజేశారు. కృష్ణయ్య మృతదేహానికి హిందూ సంప్రదాయ ప్రకారం సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్, ఓంకార్, వెంకటేష్, మధుసూదన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో అన్నదానం చేశారు.

నరసింహ యాదవ్ నియామకం హర్షణీయం

పెళ్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా గొల్ల నరసింహ యాదవ్ నియామకం పట్ల టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నరసింహ యాదవ్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబు నామినేటెడ్ పదవి ఇచ్చారన్నారు.

నేడు 104 ఉద్యోగుల నిరసన

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ జి.నాగవెంకటేష్ వెల్లడించారు. స్థానిక యశోదానగర్‌లోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 104 ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని, సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరినా స్పందన లేని కారణంగా ఆదివారం నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు.

సాయిబాబా మందిరంలో సత్యనారాయణ వ్రత పూజలు

సూళ్లూరుపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కేఆర్‌పాలెంలో ఉన్న సాయిబాబా సత్సంగ మందిరంలో శనివారం సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు. ఏటా కార్తీక మాసంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి వేదపండితులు, మంత్రోచ్చరణల నడుమ భక్తులచే సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పి.రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుష్పయాగం



నాయుడుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. స్కంధ షష్టి మహోత్సవాల చివరిరోజున శనివారం స్వామివార్లకు ప్రత్యేక పుష్పాలతో యాగం నిర్వహించారు.

పంటలకు బీమా తప్పనిసరి

పెళ్లకూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులందరూ తమ పంటలకు బీమా తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ సూచించారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్‌లో ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేస్తుందన్నారు. రైతులు ప్రధాన పంటగా సాగుచేసే వరితో పాటు వేరుశనగకు బీమా సౌకర్యం కల్పించిందన్నారు. ఈ రెండు పంటలకు డిసెంబరు 15వ తేదీలోగా బీమా చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ చందు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపరెడ్డికి నేతల శుభాకాంక్షలు



జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీనియర్ టీడీపీ నాయకుడు, సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కోట పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, అభిమానుల సమక్ష్యంలో జగన్‌మోహన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్ గురుస్వామి, ప్రసాద్, సుధాకర్, వీరరాఘవులు, సుబ్బయ్య, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శనివారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో సురేష్‌రెడ్డి దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాధయ్య, నాగరాజు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు ధర్నాను విజయవంతం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్న ప్రజాపోరు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రోజురోజుకూ నిత్యావసరాల ధరలు పెరిగిపోతుండడంతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలపై విద్యుత్‌భారం పడకుండా ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. అనంతరం సీపీఎం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నియోకవర్గ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా జోగి శివకుమార్, కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు, సురేష్, రమణయ్య, హరినాద్, ముత్యాలయ్యను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మురళి, యాదగిరి, శివకుమార్, మణి శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌కు చిట్టేడు విద్యార్థి





జాతీయ స్కూల్ గేమ్స్‌కు ఎంపికైన శైలేష్, నిష్విత‌ను అభినందిస్తున్న కిషోర్

కోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల పాఠశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న శైలేష్ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శేషవర్ధన్, చంద్రశేఖర్, పీడీ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో అండర్-19 స్కూల్ గేమ్స్ బాలుర కబడ్డీ పోటీలు జరిగాయి. నెల్లూరు జిల్లా తరపున శైలేష్ పాల్గొని రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించాడు. డిసెంబరు 7నుంచి 11వ తేదీ వరకు హర్యానాలో జరిగే నేషనల్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ తరపున కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో శైలేష్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే కోటలోని ప్రగతి విద్యానికేతన్‌లో 8వ తరగతి చదువుతున్న నిష్విత విలు విద్య పోటీలో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తెలిపారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో మన్యం జిల్లా జోగ్గింపేట గురుకుల పాఠశాలలో రాష్ట్రస్థాయి విలువిద్య అండర్14 పోటీలు జరిగాయి. ఇందులో నిష్విత ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు గుజరాత్‌లోని నాదియాక్‌లో జరిగే జాతీయస్థాయి విలువిద్య పోటీల్లో నిష్విత పాల్గొంటుందని కిషోర్ తెలిపారు. శనివారం నిష్వితను షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ షరీనా

గూడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శనివారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రవికుమార్ దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. జేవీవీ సంస్థ సైన్స్ పట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమాలను చేపట్టడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, ప్రభాకర్, రాధయ్య, విజయ్‌బాబు, అశోక్, సుబ్బారావు, జగదీష్, రవికుమార్ పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడులు

చిల్లకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట స్థావరంపై ఎస్‌ఐ సురేష్‌బాబు సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 4 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, రూ.15370 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది విష్ణు, రాజా, అల్లాం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు పరిధిలోని జాతీయ రహదారివద్ద టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి కారుతో సహా ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా టాస్క్‌ఫోర్సు సబ్ కంట్రోల్ ఆర్‌ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్‌ఐ నరేష్ బృందం, అటవీశాఖకు చెందిన ఎఫ్‌బీవో నాగేశ్వర నాయక్ బృందాలు రైల్వేకోడూరు రెడ్డిపల్లి చెరువు సమీపంలో శనివారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అధికారులను గమనించిన ఇద్దరు స్మగ్లర్లు కారును పక్కకు ఆపి దిగి పారిపోవడానికి ప్రయత్నించగా, టాస్క్‌ఫోర్సు పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతడిని కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులో దాచిన ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన స్మగ్లర్‌ను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో పాట్నా హైకోర్టు జడ్జి



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విపుల్ ఎం.పాంచోలీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామిసన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పుష్పల జయ్‌కుమార్ కుటుంబ సభ్యులు వారి తండ్రి పరమేశ్వరరావు పేరుమీద రూ.లక్ష విరాళంగా అందజేశారు. దీన్ని ఆలయ ఈవో బాపిరెడ్డి స్వీక రించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సుబ్బయ్య ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గృహ సముదాయాల నడుమ మద్యం దుకాణం వద్దు అని కరకంబాడి పంచాయతీ రాజీవ్‌గాంధీ కాలనీ మహిళలు నినదించారు. శనివారం మద్యం దుకాణం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో మద్యం దుకాణం వల్ల మహిళలకు రక్షణ లేకుండా పోతోందని దుకాణం మూసివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక మహిళలు, సీపీఎం, ఐద్వా మహిళా సంఘాల నాయకులు కలిసి ఎక్సైజ్ సీఐ నరసప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు.

భక్తవత్సలరెడ్డికి ఎస్సీవీ నాయుడి నివాళి



శ్రీకాళహస్తి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్, సీనియర్ టీడీపీ నాయకులు దొందోలు భక్తవత్సలరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తొండమ నాడుకు చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా బొజ్జల బృందమ్మ, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుపతి పార్లమెంటు తెలుగు రైతుఉపాధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, సురేష్ నాయుడు, జయరాం, మోహన్ తదితరులున్నారు.

ఏడుగంగల ఆలయంలో అటకెక్కిన అభిషేకాలు: అంజూరు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏడుగంగల ఆలయంలో కుంభాభిషేకం జరిగిన మరుసటిరోజే అభిషేక క్రతువులను అటకెక్కించారని ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న ఏడుగంగమ్మ ఆలయంలో శుక్రవారం మహాకుంభాభిషేకం జరిగింది. ఆ తరువాత 41రోజులు మండల పూజలు నిత్య ధూపదీప నైవేద్యాలు జరగడం సంప్రదాయం. అయితే మరుసటిరోజే అభిషేక క్రతువులను పూర్తిగా విస్మరించారని ఆయన పేర్కొన్నారు. కాగా కుంభాభిషేకం తరువాత శనివారం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి మధ్యాహ్నం 3గంటలకు అభిషేకాలు యథావిధిగా నిర్వహించామని ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి ప్రకటన విడుదల చేశారు.

హత్యాయత్నం కేసులో నలుగురి అరెస్టు



నలుగురి అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నలుగురిని పోలీసులు అరెస్టుచేశారు. అనతరం రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయికి చెందిన విష్ణువర్ధన్(19) శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 6వ తేదీన శ్రీకాళహస్తిలోని ధర్మ రాజులస్వామి ఆలయం వద్ద చెన్నై రోడ్డుపై మిత్రులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు చేసుకున్నాడు. ఆ సమయంలో నలుగురు యువకులు అతడిపై కత్తితో దాడిచేశారు. స్థానికులు గుర్తించి గాయపడిన విష్ణువర్ధన్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తికి చెందిన జగన్, వాసు, మునిరాజా, భరత్‌కుమార్ హత్యాయత్నానికి పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. శనివారం పట్టణంలోని గోపాలవనం ప్రాంతం వద్ద ఉండగా నిందితులను అరెస్టు చేశారు.

గ్రావెల్ రవాణా టిప్పర్‌లకు రూ. ఐదు లక్షల జరిమానా

సత్యవేడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో ఇటీవల అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తూ పట్టుపడిన ఐదు టిప్పర్‌లకు రూ.5లక్షల 20వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు బృందం స్థానిక వీర్‌కండ్రిగ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని మదనంజేరి గ్రామ సమీపంలోని క్వారీ నుంచి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌లను ఆపి రికార్డులు పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేక పోవడాన్ని గుర్తించారు. సీఐ మురళి ఆదేశాల మేరకు టిప్పర్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా మైన్స్, మోటార్ వెహికల్స్ శాఖ సూచనల మేరకు ఒక్కో టిప్పర్‌కు రూ. లక్షా 4వేలు చొప్పున జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

శ్రీసిటీని సందర్శించిన టీటీడీ బోర్డు సభ్యుడు



శ్రీసిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చెన్నైకు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కృష్ణమూర్తి వైద్యనాథన్ ఆయన సతీమణి అనురాధతో కలిసి శ్రీసిటీని సందర్శించారు. వారికి శ్రీసిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. అనంతరం వారు పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు.కాగా కృష్ణమూర్తి వైద్యనాథన్ సతీమణి అనురాధ ఐఐటీ మద్రాస్ కార్యాలయంలో సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

కన్నులపండుగలా ఆకాశదీపం



ఆకాశదీపానికి పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం ఆకాశదీపం కన్నుల పండుగగా వెలిగించారు. శ్రీకాళ హస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశ దీపాన్ని సంప్రదాయంగా వెలిగి స్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నృత్య మనోహరం



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బ్రహ్మగుడి వద్ద శనివారం నిర్వహించిన నృత్యప్రదర్శన నయనానందకరంగా సాగింది. పట్టణానికి చెందిన కొట్టే గగన శ్రీహిత, కొట్టే హేశ్రిత పలు శివనామకీర్తనలకు నృత్యప్రదర్శన చేశారు. వారికి ఆలయ అధికారులు ప్రశంసాపత్రం, జ్ఞాపికలు అందజేశారు.

నేడు బీఎస్ఎన్ఎల్ సిమ్ మేళా

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం బీఎస్ఎన్ఎల్ సిమ్ మేళా జరుగుతుందని బీఎస్ఎన్ఎల్ అధికారి వీరరాఘవులు తెలిపారు.

వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ స్థాయిలో బీఎన్‌కండ్రిగ జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో ఈ నెల 11న జరిగే వాలీ బాల్, కబడ్డీ పోటీలకు ఆసక్తిగలవారు ముం దుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని 'వీ స్పోర్ట్స్ క్లబ్' వారు శనివారం ప్రకటనలో తెలిపారు.

సమాజ సేవకు సిద్ధం కావాలి

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవ చేసేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎపుడూ సిద్ధంగా ఉండాలని భాస్కర్‌పేట మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి అన్నారు. ఉన్నత పాఠశాల నుంచి పరిసరాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్కౌట్ మాస్టర్ మురళి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం శాస్త్రోక్తంగా తైలాభిషేకం నిర్వహించారు. స్వామి వారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

చట్టాలపై అవగాహన

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలులో శనివారం న్యాయ దినోత్సవం పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు ఉచిత న్యాయం గురించి ఖైదీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గుమ్మళ్ల రాజేశ్వరరావు, శ్రీరామ్, సింధు, పారా లీగల్ వలంటీర్లు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది ఒకరికొకరు సహకరించుకోవాలని ఈవో బాపిరెడ్డి సూచించారు. ఆలయ పరిపాలనభవనంలో శనివారం అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలోని విభాగాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలపై ఎప్పటికపుడు పురోగతిసాధించాలన్నారు. ప్రతివావారం ఆయా విభాగాల ఇన్‌చార్జిలు సేవలను మెరుగుపరచి నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రశాంతతకు భంగం కలిగిస్తేచర్యలు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) ప్రజాప్రశాంతతకు భంగం కలిగించేలా రోడ్లపై న్యూసెన్స్ చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి ఆకతాయిలను హెచ్చరించారు. పట్టణంలోని రామసేతు వంతెనపై శనివారం రాత్రి పలువురు ఆకతాయిలు రోడ్లపై అల్లరి చేస్తుండగా సీఐ వారిని అదుపులోకి తీసుకున్నారు, పోలీస్‌స్టేషన్‌కు తరలించి న్యూసెన్స్ కేసు నమోదుచేశారు.

రోడ్డు పక్కన రాత్రికి రాత్రే వెలసిన బంకు



రేణిగుంట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట -తిరుపతి రోడ్డు మార్గంలో రైల్వే ఆస్పత్రి ఎదురుగా ఉన్న బస్టాప్ పక్కన ఆర్‌అండ్‌బీ స్థలంలో రాత్రికి రాత్రే ఇనుప రేకులతో చేసిన బంకును ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ప్రతిరోజూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టుకు వచ్చిన చేపలను విక్రయిస్తుంటారు. పక్కనే ఎస్‌బీఐ, కొంత దూరంలో మద్యం దుకాణాలు, పారిశ్రామిక వాడ ఉండటంతో ఓ ప్రజాప్రతినిధి రాత్రికి రాత్రి బంకును ఏర్పాటు చేశారు. బంకును బాడుగకు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ నియామకంపై హర్షం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా సదాశివాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై సత్యవేడు నియోజక వర్గ నాయీ బ్రాహ్మణ అధ్యక్షుడు వేడాం వెంకటాచలం శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఏర్పేడు మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఏర్పేడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఆమందూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి విజయకుమార్ వ్యవహరించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా సి.గురవారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి.రామకృష్ణయ్య, గౌరవాధ్యక్షులుగా భక్తవత్సలం, సహాధ్యక్షులుగా మునిరత్నం, ఉష, ఆర్థిక కార్యదర్శిగా ఎం.ఎం.శాంతి, జిల్లా కౌన్సిలర్లుగా నాగరాజు, సుధాకర్, సీతాపతి, హరినాథ్, బాబు, పద్మ, గురవారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి మోహన్‌బాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

వరదయ్యపాళెం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలంలోని ఆరు జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య, చెంచురామిరెడ్డి, మునిరాజా, వేణు, గంగయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఇసుక కావాలంటే ఆలయ కప్పం కట్టాల్సిందే..!

- తహనగర్, చిన్నయ్యగుంట, కోనేటిమిట్ట పూసలపల్లి గ్రామస్తుల వసూళ్లు
- స్థానికులకూ తప్పని భారం
- పట్టించుకోని అధికారులు



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగులు, వంకలు నుంచి సొంత అవసరాలకు ఇసుకను ఉచితంగా తరలించుకోవచ్చు. ఇది ప్రభుత్వం ఆదేశం. అయితే మండలంలో తహనగర్, చిన్నయ్య గుంట, కోనేటి మిట్ట పూసలపల్లి గ్రామాలకు ఆలయ కప్పం కట్టకుండా కాళంగి నది నుంచి జనం ఇసుక తరలించలేని పరిస్థితి ఉంది. మండలంలో తహనగర్‌లోని కాళంగి నదిలో ఇసుక ఉంది. ఇక్కడ తహ నగర్ వాసులే ట్రాక్టర్లకు ఇసుకను లోడింగ్ చేస్తారు. లోడ్ చేసినందుకు రూ. 800 నుంచి 1000ల వరకు వసూలు చేస్తారు. ఇసుకను తీసుకుని తహనగర్ గ్రామం మీదుగా రావాలంటే ఆ గ్రామానికి రూ. 300లు, చిన్నయ్య గుంటకు రూ.200లు, కోనేటి మిట్టకు రూ.200లు, పూసలపల్లికి రూ.300లు చొప్పున ప్రతి ట్రాక్టర్‌కు చెల్లించాలి. డబ్బులు చెల్లించకపోతే ట్రాక్టర్‌ను పంపరు. అడిగితే ఆలయాల నిర్మించుకోవడానికి ఇలా వసూళ్లు చేస్తున్నామని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. వరదయ్యపాళెం, తడ మండ లాలకు చెందిన వారు కూడా ఇక్కడ నుంచి రోజూ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తీసుకెళుతుం టారు. ఆ మండ లాల వారి నుంచే కాకుండా మండల ప్రజల నుంచి సైతం నగదు వసూలు చేస్తున్నారు. వ్యాపారం చేసుకునే వారి నుంచి వసూలు చేసినా ఓ అర్థం ఉందని స్థానికులు సొంత అవసరాలకు తరలించుకుంటున్నా నగదు వసూలు చేయడం పై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేసు న్నారు. అధికారులు స్పందించి కప్పం కట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


లోవోల్టేజీ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌శాఖ సిబ్బంది

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకావారి కండ్రిగ గ్రామంలోని లో వోల్టేజీ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారు. కొద్ది రోజులుగా లోవోల్టేజీ సమస్యతో గ్రామ స్తులు ఇబ్బంది పడేవారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని వారు కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను అమర్చాలని ఆదేశించారు. శనివారం తొట్టంబేడు విద్యుత్‌శాఖ అధికారి బాలాజీ తన సిబ్బందితో కలిసి గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు, విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన చెంచయ్యనాయుడు



శ్రీకాళ హస్తి, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబును శని వారం సీఎం క్యాంపు కార్యాలయంలో శ్రీకాళ హస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించారు.

అదృశ్యమైన పిల్లల అప్పగింత



శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇంటికి వెళ్లకుండా అదృశ్యమైన ఇద్దరు పిల్లలను పోలీసులు గుర్తించి తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీకాళహస్తి పట్టణం జయరామ్‌రావువీధికి చెందిన రమ్య(7), తరుణ్(5) అక్కాతమ్ముళ్లు. అదేవీధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. సాయంత్రం పాఠశాల వదిలిన తరువాత తిరిగి ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు ఆందోళనతో పోలీసులను ఆశ్రయించారు. వెంటనే శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి సిబ్బందితో బృందాలుగా ఏర్పడి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. కొండమిట్ట ప్రాంతంలో ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. సీఐ గోపికి, పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతీబాయి పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు పండ్లు, సహజ సిద్ధమై పోషక విలువలు గల ఆహార పదార్థాలు వండి ఈ ప్రదర్శనలో ఉంచారు. ఏఐ ఎస్ఎఫ్ నాయకుడు మునిచందు పాల్గొన్నారు.

భోజన నాణ్యతపై అలసత్వం తగదు

శ్రీకాళహస్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజన నాణ్యతపై అలసత్వం తగదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి అధి కారులను కోరారు. శ్రీకాళహస్తిలోని తెలుగుగంగకాలనీలో ఉన్న బాలికల గురుకుల పాఠశాల వసతిగృహాన్ని శనివారం తనిఖీ చేశారు. భోజనం బాగోలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తంచేశారు. భోజన నాణ్యత మెరుగుపరచు కోకపోతే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వసతిగృహ అధికారులను కోరారు.